నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 22 డిసెంబర్ 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సింగరేణి గుర్తింపు ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ఈ నెల 27న ఎలక్షన్ నిర్వహించాలని ఆదేశం

- ఇక ప్రచారంలో మునిగిపోనున్న కార్మిక సంఘాలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : సింగరేణి గుర్తింపు ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ప్రతిష్టంభన వీడింది. ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలను యథాతథంగా నిర్వహించాలని గురువారం రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆర్ఎల్సీని, యాజమాన్యాన్ని ఆదేశించింది. కొద్ది రోజుల నుంచి గుర్తింపు ఎన్నికల వాయిదాపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకుల్లో ప్రతిష్టంభన నెలకొంది. గురువారం హైకోర్టు ఇచ్చిన తీర్పుతో సందిగ్ధతకు తెరపడింది. ఇక కార్మిక సంఘాలు ప్రచారం ముమ్మరం చేయనున్నాయి.

కరోనా వణుకు



ఒక వైపు చలి పంజా..
మరో వైపు కొవిడ్ భయం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- చలిలో కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు

మంచిర్యాల పట్టణంలో చలి నుంచి ఉపశమనం కోసం మంట కాగుతున్న జనం

మంచిర్యాల, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం, సాయంత్రం వీస్తున్న చలిగాలులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా మంచు కురుస్తుండగా.. సాయంత్రం 7 గంటల తరువాత బయటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మారిన వాతావరణంతో చాలా మంది జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా వ్యాప్తి చెందుతుందంటూ వస్తున్న వార్తలు జనంలో వణుకు పుట్టిస్తున్నాయి. ఉత్తర తీరం నుంచి బలమైన గాలుల కారణంగా నాలుగైదు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ నెల మొదటి వారం నుంచే చలి వణికిస్తున్నది. ఇప్పటికే ప్రైవేటు, ప్రభుత్వ దవాఖానలు దగ్గు, జలుబు, జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. పిల్లల దవాఖానల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇలాంటి వాతావరణంలో వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా బయటికి రావొద్దని, అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలంటున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చని చెప్తున్నారు.

చలిలో వేగంగా వ్యాప్తి..
ప్రతి పీహెచ్‌సీలో పరీక్షలు..

ఇప్పుడు వస్తున్న కరోనా వేరియంట్ జేఎన్-1. ఇది చలి వాతావరణంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నదని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే తొమ్మిది కేసులు నమోదవడంతో దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతున్న వారిలో ఆందోళన పెరిగింది. ప్రస్తుతానికి భయపడేంత పరిస్థితి ఏం లేదని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు. మరోవైపు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. లక్షణాలున్న వారు పీహెచ్‌సీకి వస్తే నిర్ధారణ పరీక్షలు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి పీహెచ్‌సీలో రోజూ కనీసం పది పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ వేరియంట్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుండడంతో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పదేండ్ల లోపు, 60 ఏండ్లు దాటిన వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. సామాజిక దూరం పాటించడం, మాస్క్ ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవాలని చెబుతున్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ ప్రభుత్వ దవాఖానల్లో ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. 50, 100 బెడ్స్ గల ఆసుపత్రులు ఉన్న దగ్గర కూడా కరోనా టెస్టులు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇంటి లోపల వేడి వాతావరణం ఉండేలా చూసుకోవాలని చెప్తున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రత్తలు

జేఎన్-1 చలిలో వేగంగా వ్యాపించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెప్తున్నారు. రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు మన జిల్లాలో నమోదవున్న దృష్ట్యా అలర్ట్‌గా వ్యవహరించాలని సూచిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యూ)లో బుధవారం 10.4 కనిష్ఠ ఉష్ణోగ్రత ఉంటే.. గురువారం 6.6 డిగ్రీలకు పడిపోయింది. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలో గురువారం 7.5 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రంలోనే అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడం గమనార్హం. నిర్మల్ జిల్లాలోని పెంబి మండలంలో 8.7 డిగ్రీలు, మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలంలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల వరకూ పొగమంచు కప్పి ఉంటున్నది. ఈదురుగాలులు వీస్తుండడంతో జనం బయటికి రావాలంటే వణికిపోతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే వాతావరణం చల్లగా మారిపోతున్నది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు తీవ్రమైన ఎండ ఉన్నా.. వాతావరణం చల్లగా ఉంటున్నది. ఫలితంగా వివిధ పనులపై బయటికి వెళ్లిన ప్రతి ఒక్కరూ అనారోగ్యం బారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, గొంతు సంబంధిత సమస్యలతో సతమతం అవుతున్నారు.

అడ్డుకట్టకు ముందస్తు చర్యలు

జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లను అలర్ట్ చేశాం. ప్రతి పీహెచ్‌సీలో రోజుకు పది మందికి పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేశాం. మంచిర్యాల గవర్నమెంట్ ఆసుపత్రిలో ఆర్టీపీసీఆర్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎవ్వరు వచ్చినా టెస్టులు చేయాలని చెప్పాం. భయపడాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత దూరం, మాస్క్ ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవడం చేస్తే మంచింది. అవసరమైతే బయటికి వెళ్లొద్దు. మాస్క్ ధరించకపోతే జరిమాన విధించాలనే ఆదేశాలు ఉన్నాయి. **- సుబ్బారాయుడు, డీఎంహెచ్‌వో, మంచిర్యాల**

కరోనా లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి

కోటపల్లి పీహెచ్‌సీలో కరోనా పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కోటపల్లి, డిసెంబర్ 21 : జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలున్నవారు కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి సత్యనారాయణ సూచించారు. గురువారం కోటపల్లి పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కరోనా కొత్త వేరియంట్ వస్తుండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మాస్క్ ధరించడంతో పాటు పరిశుభ్రత పాటించాలని, రద్దీగల ప్రదేశాలకు వెళ్లకూడదని వైద్యాధికారి సూచించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి

- రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చూడాలి
- మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

వేలాలలో పారిశుధ్యపనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్, డిసెంబర్ 21 : పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం వేలాల గ్రామ పంచాయతీని అధికారులతో కలిసి సందర్శించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి రోజూ రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించాలని సూచించారు. నర్సరీలో బ్యాగు ఫిల్లింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించి కంపోస్ట్ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, నర్సరీ, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు వినియోగించాలని సూచించారు. శ్మశాన వాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి.. మొక్కలను సంరక్షించాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్యాగ శ్యామల, ఉప సర్పంచ్ నగేశ్, పంచాయతీ అధికారి అనిల్, కార్యదర్శి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ హోరాహోరీ..

ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్ -14 బాలబాలికల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు గురువారం రెండో రోజూ హోరాహోరీగా సాగాయి. గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఏటీడీవో క్షేత్రయ్య, వాంకిడి సీఐ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, జీసీసీ మేనేజర్ పాపారావు, క్రీడల అధికారి మీనారెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సట్ల శంకర్, లక్ష్మణ్, విద్యాసాగర్, రమేశ్, రామయ్య, నరేందర్, కృష్ణమూర్తి, శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

- ఆటో డ్రైవర్ల డిమాండ్
- ఆసిఫాబాద్‌లో ర్యాలీ • కలెక్టర్‌కు వినతి

ర్యాలీలో పాల్గొన్న ఆటో యూనియన్ నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 21 : ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో తమ బతుకులు ఆగమయ్యాయని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీతో నిరసన ర్యాలీ తీశారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్ ప్రయాణం కల్పించడం వల్ల, గిరాకీలు లేక ఆటో డ్రైవర్ల పరిస్థితి అయోమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాపిడి సురేష్, సాగర్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత తీరంలో డ్రోన్‌తో నిఘా

ప్రాణహిత ప్రాంతంలో డ్రోన్

వేమనపల్లి, డిసెంబర్ 21 : మావోయిస్టు పార్టీ శుక్రవారం భారత్‌బంద్ పిలుపునివ్వగా పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం వేమనపల్లి మండలంలోని ప్రాణహిత తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. నీల్వాయి ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో డ్రోన్‌లతో నది పరిసర ప్రాంతాల్లో పరిశీలిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి పడవల ద్వారా వేమనపల్లికి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేసి.. వివరాలు సేకరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పిషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- మంచిర్యాలలో యువజనోత్సవాలు
- వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు

మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21 : వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాలులో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలకు జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలు, కళారంగంలో రాణించాలని కోరారు. మొదటి స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం జానపద పాటలు, నృత్యం, లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. న్యాయనిర్ణేతగా శాంకరి వ్యవహరించారు.

విజేతలు వీరే..

యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలను ప్రకటించారు. ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గ్రూప్ డ్యాన్స్‌లో (ఫోక్) ప్రథమ స్థానంలో అశ్విత్ గ్రూప్(మోడల్ కాలేజ్ రాజీవ్‌నగర్), ద్వితీయ స్థానంలో ఎం చందన శ్రీ (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మంచిర్యాల) నిలిచారు. సోలో డ్యాన్స్‌లో (ఫోక్) ప్రథమ స్థానంలో రూపశ్రీ (కేజీబీవీ మంచిర్యాల), ద్వితీయ స్థానంలో టీ అలేఖ్య (టీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్, లక్షిటిపేట) నిలిచారు. గ్రూప్ సాంగ్‌లో (ఫోక్) ప్రథమ స్థానంలో ఎస్ కస్తూరి (టీఎస్ డబ్ల్యూఆర్‌జేసీ, లక్షిటిపేట), ద్వితీయ స్థానంలో ఆముల్యక్ (మైనార్టీ జూనియర్ కాలేజ్, మంచిర్యాల) నిలిచారు. సోలో సాంగ్‌లో (ఫోక్) ప్రథమ స్థానంలో జీ అంజలి (టీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్, లక్షిటిపేట), ద్వితీయ స్థానంలో కే సరిత (కేజీబీవీ, మంచిర్యాల) నిలిచారు. ఉపన్యాసంలో షగుఫ్ఫ ఆఫీన్ ప్రథమ, వర్షిత్ ద్వితీయ, స్టోరీ రైటింగ్‌లో మనీష సన (కేజీబీవీ, మంచిర్యాల) ప్రథమ, పార్థాయాదవ్ (టీఎంఆర్‌జేసీ, చెన్నూర్) ద్వితీయ స్థానంలో నిలిచారు. పోస్టర్ మేకింగ్‌లో ప్రథమ స్థానంలో మహిమదాస్ (సినీమా వాడ, మంచిర్యాల), సున్నిత (కేజీబీవీ, మంచిర్యాల) ద్వితీయ స్థానంలో నిలిచారు. ఫొటోగ్రఫీలో రేవంత్ మౌర్య ప్రథమ స్థానం, జీ కార్తీక్ (మైనార్టీ గురుకుల, చెన్నూర్) ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా అధికారులు దుర్గాప్రసాద్, పురుషోత్తం నాయక్, ధూమ్ ధాం కళాకారుడు అంతడుపుల నాగరాజు, న్యాయనిర్ణేతలు అన్నం కల్పన (నాట్య గురువు), శాంకరి, జోష్ణ చంద్రదధ్, డ్యాన్స్ మాస్టర్ మధు, కళాకారులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

టెక్నికల్ కోర్సుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 21 : నిరుద్యోగ యువత టెక్నికల్ కోర్సుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ కోర్సుల్లో భాగంగా జనవరి ఒకటో తేది నుంచి సీ, సీ-ప్లస్, జావావంటి వాటిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. https://surl.li./omfkrలో రిజిస్ట్రేషన్ కోసం చేసుకోవాలని, ఏవైనా సందేహాలుంటే సెల్ : 9502786438లో సంప్రదించాలని కోరారు.

డబ్బా ఎక్స్‌రోడ్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న ధరంపల్లి పాఠశాల విద్యార్థులు

అద్దె చెల్లించలేదని ప్రభుత్వ పాఠశాలకు తాళం

- రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు
- పక్కా భవనం నిర్మించాలని డిమాండ్

చింతలమానేపల్లి , డిసెంబర్ 21 : అద్దె చెల్లించలేదని ధరంపల్లి ప్రభుత్వ పాఠశాల(డబ్బాలో అద్దె ఇంటిలో కొనసాగుతుంది)కు యజమాని తాళం వేయడంతో విద్యార్థులు రోడ్డెక్కారు. గురువారం డబ్బా ఎక్స్‌రోడ్ వద్ద ధర్నా నిర్వహించారు. వెంటనే పాఠశాల అద్దె చెల్లించి.. పక్కా భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. కొన్ని రోజుల క్రితం ఎంఈవో సోమయ్య డబ్బా ఎక్స్‌రోడ్ వద్ద నున్న బొగ్గుల లక్ష్మి ఇంటిని అద్దెకు తీసుకొని ధరంపల్లి పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఇందులో 22 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా.. ఏడు నెలలుగా ఇంటి అద్దె చెల్లించకపోవడంతో గురువారం సదరు యజమాని ఇంటికి తాళం వేసింది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. అధికారులు పాఠశాల కొనసాగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

- మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- డయల్-100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి
- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి
- మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్
- కోటపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

కోటపల్లి, డిసెంబర్ 21 : పోలీస్‌శాఖపై నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ సిబ్బందికి సూచించారు. గురువారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సరిహద్దు భద్రత.. తదితర అంశాలపై సూచనలు చేశారు. కోటపల్లి మండలం మహారాష్ట్రకు సరిహద్దుగా ఉందని, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, ప్రజలతో స్నేహం పెంచుకోవాలని సూచించారు. వివిధ రంగాల్లో యువతకు శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలని, మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే వారితో మర్యాదగా మెలగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ పెంచాలని చెప్పారు. పాత నేరగాళ్లపై నిఘా ఉంచాలని, డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాలు నియంత్రించాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 5-ఎస్ విధానం తీరుని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.